వాన జోరు .. నదుల హోరు

- హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో జోరుగా వర్షాలు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- పలుచోట్ల పంటల నష్టం


అగళి మండలం మధూడి సమీపంలో ప్రవహిస్తున్న సువర్ణముఖి నది

మడకశిర: నియోజకవర్గంలో మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి మడకశిర మండలంలో 34.6 మి.మీ, అమరాపురం 38.6, గుడిబండ 29.2, రొళ్ల 73.4, అగళి మండలంలో 52 మి.మీటర్ల చొప్పున వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలోని వాగులు, వంకలు జోరుగా ప్రవహిస్తున్నాయి.

రొళ్ల: మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగి పొర్లాయి. రత్నగిరి కొండ ప్రాంతాల నుంచి ఆర్.రంగాపురం గ్రామ సమీపం గుండా అప్పేపల్లి గ్రామ సరిహద్దు దాటుకుని కాకి చెరువుకు పెద్ద వంక పారింది. పొంగి పొర్లుతున్న వాగును చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

అగళి: మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు చెరువు, కుంటలు, కందకాలల్లోకి నీరు చేరింది. వర్షం రావడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సోమందేపల్లి: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దాదాపు 52.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షంతో పాటు గాలుల ధాటికి సోమందేపల్లిలో రెండు భారీ వృక్షాలు నేలకూలాయి. పాపిరెడ్డిపల్లి చెరువు మరువ పారగ పలు చోట్ల వంకలు పొంగిపొర్లాయి.

మడకశిరరూరల్: గత మూడు రోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలకు వర్షపు నీళ్లు చేరుతున్నాయి. ఎండుముఖం పట్టిన వేరుశనగ, ఇతర పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. మంగళవారం గుండుమల చెరువు నిండి మరువ పారింది. అలాగే కల్లుమర్రి, ఉప్పిడిపల్లి, ఎల్లోటి, మడకశిర చెరువులకు వర్షపు నీళ్లు చేరాయి. ఒంటిపాళ్యం వద్ద రోడ్డు కోతకు గురైంది.

చిలమత్తూరు: నాలుగు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి కూడా భారీ వర్షం కురిసింది. 58.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. మండలంలోని చిత్రావతి, కుషావతి నదులు మళ్లీ జలకళ సంతరించుకున్నాయి. నదుల వైపు సమీప గ్రామాల ప్రజలెవరూ వెళ్లవద్దని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ సూచించారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ మునీర్ సిబ్బందికి సూచించారు.

హిందూపురం అర్బన్: కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండటంతో పెన్నా, జయమంగళి నదులు జలకళను సంతరించుకుంటున్నాయి. మంగళవారం విదురాశ్వర్థం (రాష్ట్ర సరిహద్దుకు) చేరుకోగా అక్కడి స్థానికులు నదికి పూజలు చేశారు. హిందూపురం సమీపంలో జయమంగళి నది ప్రవాహం పెరుగుతుందన్న అంచనాతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. రెండు నదుల సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

పరిగి: వరద నీటితో మండలంలో జయమంగళీ నదిలో పోటెత్తుతోంది. ఎగువన ఉన్న కర్ణాటక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా నదికి నీరు భారీగా వచ్చి చేరుతోంది. మండలంలోని మోదా, ఆనందపాళ్యం, బందార్లపల్లి, శ్రీరంగరాజుపల్లి, ముల్లమోతుకపల్లి, కాలువపల్లి, పరిగి, బోరెడ్డిపల్లి, సంగమేశ్వరంపల్లి తదితర గ్రామాలు జయమంగళీ నదికి పరివాహక ప్రాంతాలుగా ఉన్నాయి. శ్రీరంగరాజుపల్లిలోని వంతెనతో పాటు పరిగి చెరువుకు వెళ్లే డైవర్షన్ కెనాల్, దిగువ ప్రాంతాలకు నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దారు ఆదేశాలతో పరిగి పెద్ద చెరువుకు ఉన్న మూడు తూములను మూయించారు. అంతేకాకుండా శ్రీరంగరాజుపల్లి వద్ద నిర్మించిన పాయకట్ట వద్ద పరిగి చెరువుకు వెళ్లే ప్రధాన కాలువ వద్ద ఆర్ఐ సిద్దేశ్వర నేతృత్వంలో అత్యవసర మరమ్మతులు చేపట్టడంతో పాటూ ఏడు గేట్లలో ఆరు గేట్లను ఎత్తేశారు. దీంతో పరిగి చెరువుకు నీటిని పంపేందుకు మార్గం సుగమమైంది.

వర్షానికి కూలిన మిద్దె


ఉప్పార్లపల్లిలో కూలిన మిద్దె

అమరాపురం: మండలంలోని ఉప్పార్లపల్లికి చెందిన పాండురంగప్పకు చెందిన పాత మిద్దె సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. ఇంట్లో ఉన్న వారు బయట ఉన్న రేకుల వద్దకు వెళ్లిన సమయంలో మిద్దె పైభాగం కూలడంతో ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లోని వస్తువులు, బీరువా తదితర వస్తువులు దెబ్బతిన్నట్లు పాండురంగప్ప తెలిపారు. అధికారులు స్పందించి ఆర్థికసాయం చేయాలని కోరారు.

పంటలకు నష్టం


పెద్దిపల్లిలో వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు అశ్వర్థరెడ్డి

రొద్దం: మండల పరిధిలోని పెద్దిపల్లిలో భారీ వర్షానికి మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు రైతు అశ్వర్థరెడ్డి తెలిపారు. మూడు ఎకరాల్లో కోత దశలో ఉన్న మొక్కజొన్న వర్షం దెబ్బకు నేల వాలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

అగళి: మండల పరిధిలో రైతులు ఎక్కువ శాతం పత్తి పంటను సాగుచేశారు. వారం రోజులు క్రాస్ చేస్తే పంట చేతికి వచ్చేది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో పంట నష్టపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. కారిదాసనపల్లిలో హనుమంతరాయప్ప రెండు ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంట వర్షానికి పూర్తిగా దెబ్బతింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేస్తున్నాడు.


మడకశిర: మరువ పారుతున్న గుండుమల చెరువు


మడకశిర మండలం కల్లుమర్రి చెరువుకు చేరిన వర్షపు నీరు


అగళి మండలం మాధూడిలో నీట మునిగిన పత్తి పంట


సోమందేపల్లి: మరువ పారుతున్న పాపిరెడ్డిపల్లి చెరువు


పరిగి చెరువు తూములను మూసేయిస్తున్న ఆర్ఐ సిద్దేశ్వర్ తదితరులు


పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి వద్ద పారుతున్న జయమంగళీ నది


చిలమత్తూరు: మరవకొత్తపల్లి వద్ద జలకళ సంతరించుకున్న కుషావతి నది


హిందూపురం: ప్రవహిస్తున్న జయమంగళి నది


హిందూపురం: ఉరకలేస్తున్న పెన్నానది


రొళ్ల మండలం అప్పేపల్లి సమీపంలో పారుతున్న పెద్ద వంక

క్లుప్తంగా

పోరాట యోధుడు అల్లూరి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న గిరీష్

పరిగి: బ్రిటీష్ వారికి వెన్ను చూపకుండా దమ్ముంటే కాల్చండిరా అంటూ గుండె ధైర్యాన్ని ప్రదర్శించిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని వక్తలు కొనియాడారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా మండలంలోని సేవా మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్‌లైట్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు అల్లూరి జీవిత గాథలను వివరించారు. ఏఐడీఎస్ఓ, ఏఐడీవైఓ, ఏఐఎంఎస్ఎస్ ప్రజా సంఘాల నాయకులు గిరీష్, పూజిత, రంగనాయకులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

అగళి: మండల కేంద్రంలోని జాతీయ రహదారి కూడలిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు... రొళ్ల మండలం కేపీ తండాకు చెందిన నరసింహమూర్తి, జాత్రేనాయక్ ఇద్దరూ ద్విచక్ర వాహనంపై రొళ్ల వైపు వెళ్తున్నారు. అయితే అగళి హైవే కూడలి సమీపంలో అగళి పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ బహీర్ అగళి నుంచి నరసంబూది వెళ్తున్నారు. ఘటనా స్థలంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. తీవ్రంగా గాయపడిన నరసింహమూర్తి, జాత్రేనాయక్‌ను 108లో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు

హిందూపురం అర్బన్: ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలను జరుపుకునేందుకు అందరూ సహకరించాలని హిందూపురం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, హిందూ సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం సూగూరూ ఆంజనేయస్వామి ఆలయంలో వారు సమావేశమయ్యారు. సెప్టెంబర్ 7న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 13వ తేదీ గణేష్ ప్రతిమలను నిమజ్జనం చేయాలని నిర్ణయించామన్నారు.

ఎల్లుండి నిరసన

కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను ఖండిస్తూ ఈనెల 23న సాయంత్రం 5 గంటలకు హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన తెలియజేయనున్నట్లు హిందూ సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వైటీపీ శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



కార్యవర్గసభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం ప్రైవేట్ పాఠశాలల సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక మిర్చి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హిందూపురం జోన్ ప్రైవేట్ పాఠశాలల కమిటీ అధ్యక్షుడిగా పీ.ఎస్. శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడిగా ముస్తఫా, కార్యదర్శిగా వేణు గోపాల్, కోశాధికారి రియాజ్, ఉపాధ్యక్షుడిగా దీపు, జాయింట్ ట్రెజరర్ నందా, ఉమ్మడి కార్యదర్శి పి.ఎం రియాజ్‌తో పాటు కమిటీ ఈసీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక


ఉమా నర్మదేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ

హిందూపురం టౌన్: పట్టణంలోని త్యాగరాజనగర్‌లో వెలసిన ఉమా నర్మదేశ్వర శివాలయంలో నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడిగా అశ్వర్థ నారాయణమూర్తి, శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా గంగాధర్, గౌరవ సలహాదారుడిగా రాజశేఖర్, అధ్యక్షుడిగా గోవిందరెడ్డి, కార్యదర్శిగా ప్రదీప్, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డిను ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా జనార్దన్‌రెడ్డి, అశోక్ కుమార్, డాక్టర్ నాగేంద్రబాబు, సహాయ కార్యదర్శులుగా జయరాంరెడ్డి, వెంకటేష్, గిరిధర్, ఉప కోశాధికారులుగా బుడ్డప్ప, బాబు, బద్రి, కమిటీ మీడియా కోఆర్డినేటర్‌గా సాయి చరణ్, ప్రత్యేక సేవా కార్యకర్తగా శేషరెడ్డితో పాటు మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

పరిగి: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ బుధవారం మండలంలో పర్యటిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 9 గంటలకు తొలుత శిరేకోళం పంచాయతీ పరిధిలోని ధనాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమవుతారని పేర్కొన్నారు. అనంతరం 10 గంటలకు పి నరసాపురం పంచాయతీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ప్రత్యేక సమావేశమవుతారని చెప్పారు.

కొనసాగుతున్న నిరసనలు


హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు


గోరంట్ల బస్టాండ్ సర్కిల్‌లో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను ఖండిస్తూ మంగళవారం కూడా నిరసనలు కొనసాగాయి. బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో హిందూపురంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు కళావతి, సంతోషికుమారి, నవేరా, పవిత్ర, మురళి పాల్గొన్నారు.

మడకశిరరూరల్: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారం ఘటనను నిరసిస్తూ మంగళవారం కదిరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేశారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు హంతకులను కఠినంగా శిక్షించాలని నినదించారు.

పెనుకొండ: కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని పొదుపు సంఘాల మహిళలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే పట్టణంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక అంబేడ్కర్ సర్కిల్లో మానవహారం నిర్వహించారు.

గోరంట్ల: కలకత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను ఖండిస్తూ మంగళవారం ఆర్‌డీటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌పీఎస్ జూనియర్ కళాశాల నుంచి బస్టాండ్ సర్కిల్ వరకూ విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. జూనియర్ డాక్టర్ కుటుంబాన్ని ఆదుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జీఓ 84ను రద్దు చేయాలి


ఎంఈఓ గంగప్పకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

హిందూపురం టౌన్: మున్సిపల్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీఓ నంబర్ 84ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హిందూపురం మున్సిపల్ ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎంఈఓ గంగప్పకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా పదోన్నతులు, బదిలీలు లేకుండా కాలం వెళ్లబుచ్చుతున్నామన్నారు. ఇతర మేనేజ్మెంట్‌ల ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలు పొందారని, మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖ ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయులుగా పరిగణిస్తోందన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి పని సర్దుబాటులో మున్సిపల్ ఉపాధ్యాయులను అదే మేనేజ్మెంట్‌లోనే సర్దుబాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాస్, పెన్నోబులం, చంద్రానాయక్, బాలకృష్ణ, జనార్దన్, హరి, సురేష్, బాలకృష్ణ, నగేష్, కేశవరెడ్డి, ఎస్‌టీయూ నాయకులు గొబ్రే నాయక్, సమీఉల్లా, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన వైస్ చైర్మన్ జబీవుల్లా


బెంగళూరు విమానాశ్రయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన జబీవుల్లా

హిందూపురం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం బెంగళూరు విమానాశ్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా మర్యాదపూర్వకంగా కలిశారు. హిందూపురం మున్సిపాల్టీలోని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను టీడీపీ నాయకులు బెదిరించి, మభ్యపెట్టి పార్టీలోకి చేర్చుకుంటున్నారని వైఎస్ జగన్‌కు వివరించినట్లు జబీవుల్లా తెలిపారు. మభ్యపెట్టడం టీడీపీ నైజమని, ఇంకా అవసరమైతే కేసులు కూడా పెడతారని, భయపడొద్దని జగన్ సూచించారన్నారు. పార్టీ అండగా ఉంటుందని, పార్టీ బలోపేతానికి అందరూ కలసి కట్టుగా కృషి చేయాలని పేర్కొన్నారన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంచుకోండి


రొళ్ల గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా కార్యదర్శి పి.రమ

రొళ్ల: గ్రంథాలయంలో లభించే పుస్తకాలు సద్వినియోగం చేసుకుని పాఠకులు, విద్యార్థులు జ్ఞానాన్ని మరింత పెంచుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గుడిబండ ప్రధాన రోడ్డు పక్కన ఉన్న గ్రంథాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఉమ్మడి జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి రమా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు.

భక్తి భావాలను పెంపొందించుకోవాలి

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ భక్తి భావాలను పెంపొందించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని వాస్తు పండిట్ చందకచెర్లు ధనుంజయస్వామి భక్తులకు తెలిపారు. శ్రావణ పూర్ణిమ సందర్భంగా మంగళవారం భూమానంద ఆశ్రమంలో ధనుంజయస్వామి భక్తులతో కలిసి వేడుకలు నిర్వహించారు. భక్తులకు ఉచితంగా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని అప్పుడే మంచి జరుగుతుందన్నారు.

ఎస్పీని కలిసిన గోరంట్ల సీఐ


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ శేఖర్

పుట్టపర్తి టౌన్: నూతనంగా గోరంట్ల సీఐగా బాధ్యతలు చేపట్టిన జి.శేఖర్ మంగళవారం పుట్టపర్తిలోని ఎస్పీ చాంబర్‌లో ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతి భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనిచేయాలని ఆమె సీఐకి సూచించారు. జిల్లా సరిహద్దుల్లో ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి

మడకశిర: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ ఆశయాల సాధనకు కృషి చేద్దామని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు ఎన్‌రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం జరిగిన మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ 80వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంచి పెట్టారు.

దోమల నివారణకు కృషి చేయాలి


గోరంట్ల: దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యుడు ఓంకార్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో వారానికి ఒకసారి తప్పనిసరిగా డ్రైడే పాటించాలన్నారు. పీహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ, హెల్త్ సూపర్ వైజర్లు రవీంద్ర, రత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్ల: దోమ రహిత సమాజం ఆరోగ్యానికి సోపానమని వైద్యాధికారిణి శృతి పేర్కొన్నారు. దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బస్టాండ్ సర్కిల్ వరకూ ర్యాలీ చేశారు. డాక్టర్ శృతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రమణ, మలేరియ సబ్ యూనిట్ అధికారి శివన్న, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా మండల మీట్



మాట్లాడుతున్న ఎంపీపీ గీత

పెనుకొండ: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్యాధికారులకు ఎంపీపీ గీత సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ప్రాంతంలో విపరీతమైన దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. రోగాల వ్యాప్తి నేపథ్యంలో వైద్య సిబ్బంది వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వీఆర్‌ఓలు తమ పరిధిలో వాటర్ పైప్‌లైన్లు పగిలి ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సీడీపీఓ శాంతలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలను నియంత్రించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జేసీ


అధికారులకు సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

గుడిబండ: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తనిఖీ చేశారు. అనంతరం స్థానిక అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ కరుణాకర్‌తో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ పనుల గురించి ఆరా తీసి, బయోమెట్రిక్ పనితీరుని పరిశీలించారు.

అనుమతి లేని లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేయొద్దు

మడకశిర: మడకశిర నగర పంచాయతీ పరిధిలో వేసిన లేఅవుట్లలో అనుమతి లేనిచోట్ల స్థలాలు కొనుగోలు చేయొద్దని నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి ప్రజలకు సూచించారు. నగర పంచాయతీలోని ఆదిరెడ్డి పాళ్యం, పెనుకొండ రోడ్డు, బేల్దారు కాలనీ, మల్లినాయనపల్లి, మారుతి నగర్, మధుగిరి రోడ్డు ప్రాంతాల్లో మున్సిపల్ అనుమతి లేకుండా కొందరు రైతుల నుంచి స్థలాలను కొనుగోలు చేసుకుని లేఅవుట్లు వేశారన్నారు. ఈ లేఔట్లలో స్థలాలు కొనుగోలు చేసినా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వమన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

మడకశిర: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం భారత్ బంద్‌లో భాగంగా మడకశిరలో బంద్‌ను నిర్వహిస్తున్నామని మాల మహానాడు మడకశిర కార్యదర్శి సోమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బంద్‌లో మాల మహానాడు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు బంద్‌కు సహకరించాలన్నారు.